సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 26 । అక్టోబర్ । 2023



మద్యం రవాణాపై నిఘా
ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి మద్యం అక్రమ రవాణాపై జిల్లా ఎక్సైజ్ అధికారులు నిఘా పటిష్టం చేశారు. 10లో



నాణ్యమైన ఇంధనం వాడాలి
వినియోగదారులు నాణ్యమైన ఇంధనం వినియోగించి, వాహనాలను మన్నికగా ఉంచుకోవాలని ఎస్పీ వినీత్ సూచించారు. 10లో

గరిష్టం/కనిష్టం
32°/20°
వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వాతావరణం చల్ల బడుతుంది. కొన్ని చోట్ల మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఐసీఎంఆర్ బృందం పర్యటన



గ్రామస్తులతో ఐసీఆర్ బృందం సభ్యులు

కరకగూడెం : మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామమైన అంగోరుగూడెంలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) పూణే బృందం సభ్యులు బుధవారం పర్యటించారు. గ్రామంలో 65 మంది నుంచి రక్తనమూనాలను సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించగా 12 మందికి మలేరియా నమోదైనట్లు గుర్తించారు. మరో 12 మంది కూడా జ్వరపీడితులు ఉన్నారని తెలిపారు. వారందరికీ ఏసీటీ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు మనీష్ కుమార్, పాండేవ్ భట్, నరేంద్ర చంద్ర వనషి, మలేరియా సూపర్‌వైజర్ అరుణ్ బాబు, ఏఎన్‌ఎంలు నాగరత్నం, జ్యోతి, హెల్త్ అసిస్టెంట్లు నర్సింహారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు



నాగా సీతారాములు

సుజాతనగర్: కాంగ్రెస్ పార్టీ టికెట్ రాకుంటే తాను రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానంటూ జరుగుతున్న ప్రచారం నమ్మొద్దని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. తన తాత, తండ్రి కాంగ్రెస్‌లోనే కొనసాగారని, వారి బాటలోనే తానూ పార్టీకి విధేయుడిగా ఉంటానని స్పష్టం చేశారు. కొంత మంది కావాలని తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి మొదటి నుంచి కాంగ్రెస్‌లోనే ఉంటూ నిత్యం కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటున్న తనకు టికెట్ విషయంలో పార్టీ అన్యాయం చేయదని పేర్కొన్నారు. బీసీ కోటాలో టికెట్ వస్తుందనే నమ్మకం ఉందని, రెబల్‌గా పోటీ చేస్తాననే ప్రచారంతో తనకు సంబంధం లేదని, పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేస్తానని స్పష్టం చేశారు.

ఎరియర్స్, లాభాల వాటా చెల్లించాలి



మాట్లాడుతున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులు

మణుగూరు టౌన్: తమకు ఎరియర్స్, లాభాల వాటా చెల్లించాలని మణుగూరు ఏరియాలోని సింగరేణి రిటైర్డ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం అంబేద్కర్ సెంటర్‌లో వారు మాట్లాడుతూ రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా, దీపావళి బోనస్ (2022 మార్చి నుంచి 2023 మార్చి వరకు) చెల్లింపుల్లో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు 2021 జూలై 10వ వేజ్‌బోర్డు ఎరియర్స్ ఇప్పటివరకు చెల్లించకపోవడం సరికాదని అన్నారు. రిటైర్డ్ కార్మికుల పింఛన్ ఫిక్సేషన్ కూడా చేయలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో సామా శ్రీనివాసరెడ్డి, నామా వెంకటేశ్వరరావు, బైరి శ్రీనివాస్, శివరావు, ఎండీ ఇమాముద్దీన్, శేఖర్, తిరుపతి రెడ్డి, రామయ్య, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు సౌర వెలుగులు



సోలార్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ రమాదేవి (ఫైల్)

రాష్ట్రంలోనే తొలి ఆలయంగా రికార్డు
- భద్రాచలం రామాలయంలో ఇటీవలే సోలార్ ప్లాంట్ ప్రారంభం
- తొలి విడతగా 75 కిలోవాట్లతో వెలుగులు
- ముక్కోటి నాటికి 500 కిలోవాట్ల ఉత్పత్తికి సన్నాహాలు



విద్యుత్ లైట్ల వెలుగుల్లో కళకళలాడుతున్న రామాలయం (ఫైల్)

భద్రాచలం: రాష్ట్రంలోనే తొలి సౌర వెలుగుల ఆలయంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం రికార్డులకెక్కింది. విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించుకునేందుకు ఆలయ అధికారులు చేపట్టిన ప్రయత్నంలో తొలిదశ ఫలితాలు మొదలయ్యాయి. సన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యాన చేపట్టిన సోలార్ ప్లాంట్ పనులు పూర్తి కావడంతో తాజాగా ఆలయ ఈఓ ఎల్.రమాదేవి ప్రారంభించారు. దీంతో 75 కిలోవాట్ల ప్లాంట్ ఉత్పత్తి మొదలుపెట్టింది.

ముక్కోటి నాటికి పూర్తిగా..
సోలార్ ప్లాంట్లను వసతి గదులు, రామాలయం, కాటేజీల వద్ద ఏర్పాటు చేశారు. తొలి విడతగా కరకట్టకు దిగువన ఉన్న రామానిలయం, సీతానిలయం వద్ద ఏర్పాటు చేసిన 75 కిలోవాట్ల ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అందుబాటులోకి రావడంతో ఈఓ ఎల్.రమాదేవి ఇటీవల పూజలు చేశారు. మొత్తంగా ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ రూ.2.5 కోట్లతో 500 కిలోవాట్ల విద్యుత్‌ను దేవస్థానానికి అందించేలా ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది డిసెంబర్ 22, 23 తేదీల్లో ఆలయంలో తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం వేడుకలు జరగనున్నాయి. అప్పటిలోగా పనులన్నీ పూర్తిచేసి రామాలయానికి పూర్తిగా సోలార్ వెలుగులను అందుబాటులోకి తీసుకు రావాలనే లక్ష్యంగా పనులు చేస్తున్నారు.

రూ.2.50 కోట్లతో 500 కిలోవాట్ల సోలార్ విద్యుత్
ఆలయ అవసరాలకు వినియోగిస్తున్న విద్యుత్‌కు ఒక్కో యూనిట్‌కు రూ.9 వరకు చెల్లిస్తున్నారు. దేవస్థానం ఆధ్వర్యాన నడిచే కాటేజీలు, సత్రాలు, గదులు, కార్యాలయాలు, దేవస్థానం నిర్వహణకు ఏటా సుమారు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. ఆలయానికి ఇది భారంగా మారడంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గమైన సోలార్ వైపు మొగ్గు చూపారు. ఈ క్రమంలో సన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముందుకు రావడంతో ఒప్పందం కుదిరింది. రూ.2.50 కోట్ల వ్యయంతో 500 కిలోవాట్ల సోలార్ ప్లాంట్లను సదరు సంస్థ అమరుస్తుండగా.. నిర్మాణం, నిర్వహణ ఆలయానికి సంబంధం లేకుండా యూనిట్ వినియోగానికి రూ.5.25 చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే ధర 25 ఏళ్ల పాటు అమల్లో ఉండనుంది. తద్వారా విద్యుత్ బిల్లుల్లో సుమారు 40 శాతం వరకు నిధులు ఆదా అవుతాయని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

వ్యయాన్ని తగ్గించేందుకు చక్కటి మార్గం
సోలార్ విద్యుత్‌ను అమల్లోకి తీసుకురావడం వల్ల ఆలయంపై నిర్వహణ భారం తగ్గుతుంది. తద్వారా ఆ నిధులతో భక్తులకు మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురావొచ్చు. అందువల్ల ప్రైవేట్ సంస్థ ద్వారా తక్కువ ఖర్చుతో సోలార్ విద్యుత్ కొనుగోలు చేస్తున్నాం. ముక్కోటి నాటికి పనులన్నీ పూర్తిచేసి రామాలయం మొత్తానికి సోలార్ విద్యుత్ అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం.
– రమాదేవి, దేవాలయ కార్యనిర్వహణాధికారి

అమరుల త్యాగాలను స్మరించుకుందాం

ఎస్పీ డాక్టర్ వినీత్



సైకిల్ ర్యాలీలో ఎస్పీ వినీత్, పోలీస్ అధికారులు

కొత్తగూడెంరూరల్: పోలీసు అమరవీరుల త్యాగాలను సర్మించుకోవటం అందరి బాధ్యత అని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి సెంట్రల్ పార్క్ నుంచి పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం సైకిల్ యాత్ర నిర్వహించారు. తొలుత ఇల్లెందు క్రాస్ రోడ్డు, రైల్వే స్టేషన్, బస్టాండ్, పోస్టాఫీస్ సెంటర్ నుంచి విద్యానగర్ కాలనీ, బైపాస్ రోడ్డు, రామవరం మీదుగా రుంద్రపూర్ పార్కు వరకు 150 మంది పోలీసు అధికారులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎంతో మంది పోలీసు అమర వీరుల త్యాగాల ఫలితంగానే నేడు స్వేచ్ఛా వాయువులు పీల్చుకోగలుగుతున్నామని అన్నారు. నిత్యం వ్యాయామం చేయడం ద్వారా సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సైకిల్ ర్యాలీ చేయటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్) టి. సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు, సీఆర్‌పీఎఫ్ అధికారులు రితేష్‌ఠాకూర్, సెంతిల్ కుమార్, కమల్ వీర్ యాదవ్, రజిత, సందీప్‌రెడ్డి, అడిషనల్ కమాండెంట్ అంజయ్య, డీఎస్పీలు రెహమాన్, వెంకటేష్, రాఘవేంద్రరావు, రమణమూర్తి, మల్లయ్య స్వామి, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టాలి

గుండాల/కరకగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై నిఘా ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వినీత్ అన్నారు. బుధవారం ఆయన గుండాల, కరకగూడెం, ఏడూళ్ల బయ్యారం పోలీస్‌స్టేషన్‌లను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన రహదారుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఆధారాలు లేకుండా తరలించే డబ్బును స్వాధీనం చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించాలన్నారు. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేలా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఏడూళ్ల బయ్యారంలో ఏర్పాటుచేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఆయన వెంట ఓఎస్డీ మనోహర్, ఇల్లెందు, మణుగూరు డీఎస్పీలు రమణమూర్తి, రాఘవేంద్రరావు, సీఐలు రవీందర్, శివప్రసాద్, ఎస్సైలు రాజశేఖర్, రాజారాం ఉన్నారు.

జగదభిరాముడి సాక్షిగా మళ్లీ పెళ్లి..

ఎన్‌ఆర్‌ఐ దంపతుల వివాహం



హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్న ఎన్‌ఆర్‌ఐ దంపతులు

భద్రాచలం : కొత్తగూడేనికి చెందిన ఓ అబ్బాయి ఉద్యోగ నిమిత్తం అమెరికాలోని కాలిఫోర్నియా వెళ్లాడు. అక్కడి అమ్మాయి లోరీనాతో మనసు కలిసింది. ఇరు కుటుంబాల సమ్మతితో అక్కడే వివాహం చేసుకున్నా హిందూ సంప్రదాయం ప్రకారం మళ్లీ పెళ్లి చేసుకోవాలనుకున్న వారి కోరిక ఐదేళ్లుగా ఫలించలేదు. ఇటీవల కొత్తగూడెం వచ్చిన ఆ దంపతులు తల్లిదండ్రులకు విషయం చెప్పగా.. బుధవారం భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో మళ్లీ పెళ్లి జరిపించారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడేనికి చెందిన డాక్టర్ ఏలూరి రాజేశ్వరరావు, ఆంధ్రావాణి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, పెద్దవాడైన రామచంద్రరావు ఉద్యోగ నిమిత్తం కాలిఫోర్నియాలో స్థిరపడ్డారు. అదే ప్రాంతానికి చెందిన లోరీనాతో పరిచయమై ప్రేమ చిగురించగా పెళ్లికి దారితీసింది. ఇరు కుటుంబాల వారిని ఒప్పించి 2018లో వివాహం చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల వయసున్న కుమారుడు, ఏడాది వయసు గల కుమార్తె ఉన్నారు. కాగా, ఇటీవలే తొలిసారి కొత్తగూడెం వచ్చిన దంపతులు హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకోవాలన్న కోరికను పెద్దలకు చెప్పగా.. బుధవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మరోసారి పెళ్లి జరిపించారు.

పాఠశాలలు నేడు పునః ప్రారంభం

జిల్లాలోని 23 స్కూళ్లలో అల్పాహారం షురూ..



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: దసరా సెలవుల అనంతరం గురువారం ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు స్కూళ్లను శుభ్రం చేయించారు. దసరా సెలవులకు ముందు నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున జిల్లాలోని ఐదు స్కూళ్లలో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రారంభించగా నేటి నుంచి ప్రతి మండలంలో ఒక పాఠశాలలో అల్పాహారం అందించనున్నారు.

జూమ్ సమావేశంలో డీఈఓ దిశానిర్దేశం..
దసరా సెలవుల అనంతరం గురువారం జిల్లాలోని అన్ని పాఠశాలలు పునః ప్రారంభం కానున్న సందర్భంగా డీఈఓ వెంకటేశ్వరాచారి బుధవారం ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు విడతల వారీగా అల్పాహార పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. మొదటి విడతగా మండలానికి ఒకటి చొప్పున 23 పాఠశాలల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుందన్నారు. తొమ్మిది విడతల్లో మొత్తం 1,334 పాఠశాలల్లో అమలు చేస్తామని చెప్పారు. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు. యూడైస్ ప్లస్ అప్‌డేషన్‌కు సంబంధించి కాంప్లెక్స్ స్థాయిలో వర్క్ షాపులు నిర్వహించాలని, అన్ని పాఠశాలల నుంచి రిజిస్టర్లు తెప్పించుకుని పరిశీలించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్లు ఎస్‌కే సైదులు, ఎన్.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతివ్వాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణకు పార్టీలన్నీ మద్దతు తెలపాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కోరారు. ఖమ్మంలో బుధవారం ఆయన మాట్లాడుతూ వర్గీకరణను వ్యతిరేకించే పార్టీలకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ఆమోదించాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు వర్గీకరణపై ఇచ్చిన హామీలను విస్మరించాయని ఆరోపించారు.

ఘనంగా అమ్మవారి శోభాయాత్ర

పాల్వంచ : శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని బుధవారం నిమజ్జనానికి తరలించారు. మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, భక్తుల కోలాటాల నడుమ శోభాయాత్రగా తీసుకెళ్లారు. అంతకుముందు మార్కెట్ ఏరియాలో భక్తులు భారీగా హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చలవాది ప్రకాశ్, ప్రవీణ్, సంపత్, నాగరాజు, రాము, రెడ్డి, శంకరమ్మ, సంధ్య, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి శోభాయాత్రలో కమిటీ సభ్యులు

మా బతుకులు మారేదెన్నడు?

- పేదలంటే ఏ సర్కార్‌కైనా చిన్నచూపే..
- కార్మికులుగా బతుకులు చాలిస్తున్నాం
- తమను ఆదుకునే పథకాలను ప్రభుత్వాలు ప్రవేశపెట్టాలి
- భవన నిర్మాణ కార్మికులు, ఆటోడ్రైవర్ల డిమాండ్



ఎన్టీఆర్ సర్కిల్ అడ్డాపై భవన నిర్మాణ రంగ కూలీలు



పాత బస్టాండ్ అడ్డాలో ఆటోకార్మికులు

ఖమ్మంమయూరిసెంటర్: రెక్కాడితే కాని డొక్కాడని బతుకులు.. రోజంతా శ్రమించినా కుటుంబం గడవడం కష్టమైన పరిస్థితులు... చిన్నచిన్న ఆనందాలను కూడా చూడకుండాలనే చాలిస్తున్న జీవితాలు.. దురదృష్టవశాత్తు ఏదైనా రోగం వస్తే వైద్యం చేయించుకోవడానికి దిక్కులు చూడాల్సిన దైన్యం.. అడ్డాపై భవన నిర్మాణ కార్మికులు గంటల తరబడి నిలబడినా పని దొరుకుతుందన్న నమ్మకం లేదు. పని దొరికితే ఆ రోజుకు కుటుంబం గడుస్తుందన్న ఆనందమే తప్ప భవిష్యత్‌పై ఎప్పటి మాదిరి బెంగే... ఇక ఆటో కార్మికుల పరిస్థితీ అంతే. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికుల కోసం ఎదురుచూడాలి.. స్వయం ఉపాధి కోసం ఆటో రంగాన్ని నమ్ముకుంటున్న యువత సంఖ్య నానాటికీ పెరుగుతుండగా, ప్రభుత్వం నుంచి కనీస ఆసరా లభించడం లేదనే ఆవేదన వ్యక్తం అవుతోంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికులను, పాత బస్టాండ్ వద్ద ఆటో అడ్డా కార్మికులను 'ప్రజా అజెండా'లో భాగంగా 'సాక్షి' పలకరించగా.. వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆవేదనను వెల్లడించారు.

ఈయన పేరు సంజీవరావు. దానవాయిగూడెంకు చెందిన సంజీవ్ భవన నిర్మాణ రంగాన్నే నమ్ముకుని కూలీ పనులు చేస్తున్నాడు. పదేళ్లుగా ఖమ్మంలో నివాసముంటున్న ఆయన కుటుంబం అద్దె ఇంట్లో జీవనం వెళ్లదీస్తోంది. పని చేస్తేనే పూట గడిచే పరిస్థితుల్లో ఇంటి అద్దె, కుటుంబ పోషణ భారంగా మారిందని కన్నీటి పర్యంతమయ్యాడు. పథకాల మాటేమో కానీ కనీసం తనలాంటోళ్లు ఉండేందుకు ఇల్లు ఇస్తే చాలని కోరాడు.

ప్రజా అజెండా

ఏ సర్కారైనా అంతే...
ఏ సర్కారైనా పెద్దవారికి ప్రయోజనం కలిగేలా పాలిస్తోంది తప్ప పేదలను పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పేద వాళ్లకు ఏం చేయొచ్చనే అంశాన్ని గుర్తించకపోవడంతోనే పథకాలను మేనిఫెస్టోల్లో పెట్టడం లేదని తెలిపారు. పనిచేస్తేనే, ఆటో నడిపితేనే రెండు పూటలా తిండి దొరుకుతుందని, లేకపోతే పస్తులు ఉండాల్సిన తమ జీవితాలకు ఆసరా కల్పించేలా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. రోజంతా కష్టపడితే కుటుంబ పోషణకే సరిపోకపోగా... పిల్లల భవిష్యత్‌పై ఆవేదన తమను వెంటాడుతోందని తెలిపారు. కార్మికులు, ఆటోడ్రైవర్లకు ఉపాధి కల్పించి, కనీస సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వెల్లడించారు. పిల్లల చదువు కోసం ఉపకార వేతనాలు, ప్రమాదాల బారిన పడితే ఆర్థికసాయం, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లోనైనా పార్టీలు కార్మికులు, ఆటో డ్రైవర్ల బతుకులు మార్చేలా పథకాలు ప్రకటించాలని కోరుతున్నారు.

పేదలను పట్టించుకోవడం లేదు..



ఏ ప్రభుత్వం పేదలను పట్టించుకోవడం లేదు. ఎవరైనా సరే పెద్దలకు ప్రయోజనం కలిగేలా పథకాలు పెడుతున్నారు. ఏళ్లుగా భవన నిర్మాణ రంగాన్ని నమ్ముకొని జీవిస్తున్న తమను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇకనైనా కార్మికుల కోసం పథకాలు ప్రవేశపెట్టి అమలుచేయాలి.
– మేకల వెంకన్న, అడ్డా కూలీ

కార్డులు లేవు.. పథకాలు రావు



సెంట్ భూమి లేకున్నా ప్రభుత్వ పథకాలు అందడం లేదు. తొమ్మిదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో బియ్యం కూడా రావట్లేదు. ఇప్పటివరకు ఏ పథకం అందలేదు. కార్మికులకు పాలకులు ఆర్థిక సాయం అందించి బీమా చేయించాలి.
– కోటేష్, అడ్డా కూలీ

భూమి ఉన్నోళ్లకే లబ్ధి..



భూమి ఉన్నోళ్లకే తప్ప ఉద్యోగం, ఉపాధి లేక ఆటో నడుపుకునే మాలాంటి కార్మికులకు ప్రభుత్వాలు పథకాలు ప్రవేశపెట్టడం లేదు. రోజంతా ఆటో నడిపినా కుటుంబం గడవడమే కష్టం. పెరిగిన ధరలతో పొదుపు చేయలేని స్థితిలో ఉన్న సామాన్యులను పట్టించుకోవాలి.
– మహేందర్, ఆటో కార్మికుడు

ఆటో కార్మికులను ఆదుకోవాలి..



30 ఏళ్లుగా ఆటో నడుపుతున్నా. రోజంతా ఆటో తోలితే వచ్చే డబ్బు తిండికే సరిపోతుంది. ఇంట్లో ఎవరికైనా ఆపదొచ్చినా, ఆరోగ్యం బాగా లేకున్నా చికిత్సకు అవసరమైన డబ్బు సంపాదించలేకపోతున్నాం. ఆటో కార్మికుల కోసం ప్రభుత్వం పథకాలు ప్రవేశపెట్టి ఆదుకోవాలి.
– బత్తుల వీరన్న, ఆటో కార్మికుడు

క్లుప్తంగా

వృద్ధుడు ఆత్మహత్య

జూలూరుపాడు: మండలంలోని సురారం గ్రామానికి ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ బి.పురుషోత్తం కథనం ప్రకారం.. సురారం గ్రామానికి చెందిన బోడా సోమ్లా(70) కొంత కాలంగా మానసిక వేదనకు గురవుతున్నాడు. కుటుంబసభ్యులు పలుమార్లు ఆస్పత్రికి తీసుకెళ్లినా ఆరోగ్యం మెరుగుపడలేదు. ఈ క్రమంలో జూలూరుపాడు వెళ్లి వస్తానంటూ ఇంట్లో చెప్పి వెళ్లిన వృద్ధుడు తహసీల్దార్ కార్యాలయ సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. సురారం గ్రామస్తులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్మశాన వాటికల్లో మోటార్ల చోరీ

పాల్వంచ: పక్కపక్కనే ఉన్న రెండు గ్రామ పంచాయతీల శ్మశాన వాటికల్లో మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని బసవ తారక కాలనీ, బిక్కు తండా గ్రామ పంచాయతీల శ్మశాన వాటికల్లోని రెండు మోటార్లను మంగళవారం రాత్రి అపహరించారు. ఒక్కో మోటార్ విలువ రూ.40 వేల చొప్పున మొత్తం రూ.80 వేల నష్టం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. మరుగొడ్డి డోర్లు కూడా చోరీ చేశారు. శ్మశాన వాటికల వద్ద ఉన్న డంపింగ్ యార్డుల్లో వేరు చేసిన ప్లాస్టిక్, ఇనుప వస్తువులను కూడా తరచూ చోరీ చేస్తున్నట్లు బసవ తారక కాలనీ ఉప సర్పంచ్ కొడుపుగంటి శ్రీను తెలిపారు.

బతుకమ్మ నిమజ్జనంలో ఘర్షణ

బూర్గంపాడు: మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో బతుకమ్మ నిమజ్జన కార్యక్రమంలో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. బతుకమ్మలను ఊరేగింపుగా గోదావరి నదికి తీసుకెళ్తున్న క్రమంలో కొందరు యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుని పరస్పరం భౌతికదాడులకు దిగారు. ఈ ఘటనలో కొందరికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సైబర్ కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: రుణం ఇప్పిస్తానని చెప్పి నగదు కాజేసిన ఘటనలో బుధవారం పోలీసులు సైబర్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన యంబడి మల్లికార్జున రావుకు విజయ్ రెడ్డి అనే వ్యక్తి గత ఆగస్టు 1న ఫోన్ చేశాడు. రూ.30 లక్షలు లోన్ ఇప్పిస్తానని నమ్మించాడు. అనంతరం రాహుల్ అనే వ్యక్తి ఫోన్ చేసి తాను భద్రాచలం వస్తున్నానంటూ మభ్యపెట్టి ఫోన్ పే ద్వారా పలు దఫాలుగా రూ.65,250 నగదును ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత మోసం పోయానని తెలుసుకున్న బాధితుడు 1930 అనే సైబర్ క్రైం నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. బుధవారం భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ నాగరాజు రెడ్డి కేసు నమోదు చేశారు.

9,570 వాచ్‌లు సీజ్

ఖమ్మంక్రైం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి బంధువు తుంబూరు దయాకర్‌రెడ్డి ఇంట్లో నిల్వ ఉన్న గోడ గడియారాలను బుధవారం ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. ఖమ్మం అర్బన్ మండలం ధంసలాపురంలోని దయాకర్‌రెడ్డి ఇంట్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఎన్నికల స్పెషల్ స్క్వాడ్ బృందం తనిఖీ చేయగా రూ.46,83,300 విలువైన 9,570 గోడ గడియారాలు లభించాయని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శివరామయ్య తెలిపారు. అయితే, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుమార్తె వివాహ సమయంలో వీటిని తయారుచేయించినట్లు బిల్లులను దయాకర్‌రెడ్డి చూపించారని సమాచారం . ఈ అంశంపై ఏసీపీని వివరణ కోరగా వాచ్‌లకు సంబంధించి పూర్తి ఆధారాలు సమర్పిస్తే తిరిగి ఇచ్చేస్తామని తెలిపారు. తనిఖీల్లో స్పెషల్ స్క్వాడ్ అధికారి సుమ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాల్వంచ: పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. పట్టణంలోని కేఎస్పీ రోడ్ నుంచి ఒడ్డుగూడేనికి వెళ్లే రోడ్డులో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ రాఘవయ్య సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. రూ. 7,200 నగదు, 4 సెల్‌ఫోన్‌లు, 3 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరం కై కొండాయిగూడెంనకు చెందిన తమ్మాడపు వెంకన్న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆయన కుమారుడు ఖానాపురం హవేలీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, వెంకన్నకు మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో చికిత్స చేయిస్తున్నారు. ఆయన మంగళవారం ఇంటి బయట కూర్చుని వెళ్లిపోగా, ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,231

మద్యం రవాణాపై నిఘా

- చెక్‌పోస్టులు, రూట్ వాచ్‌లలో గస్తీ పటిష్టం
- డంప్‌ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి
- కోడ్ అమలు నుంచి 87 కేసులు
- గంజాయి రవాణాపై కూడా డేగ కన్ను



జూలూరుపాడులో ఇటీవల పట్టుకున్న మద్యంతో పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో మద్యం అక్రమ రవాణాపై జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు నిఘా పటిష్టం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు, జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు మద్యం భారీ స్థాయిలో రవాణా జరుగకుండా ప్రత్యేకంగా దృష్టి సారించారు. జిల్లాకు సరిహద్దు ప్రాంతాలుగా ఉన్న భద్రాచలం, అశ్వారావుపేట వంటి నియోజకవర్గాలలో నిఘా ఎక్కువగా పెంచారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే రాజకీయ పార్టీల నాయకులు మద్యాన్ని భారీగా కొనుగోలు చేసి రహస్య ప్రాంతాల్లో నిల్వ పెట్టి ఎన్నికల సమయంలో ప్రలోభాలకు గురిచేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ప్రలోభాలకు ప్రజలు, ఓటర్లు గురికాకుండా ఉండేందుకు గానూ ఇప్పటినుంచే ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది నిరంతర నిఘా పెట్టినప్పటికీ కూడా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మద్యం రవాణా చేస్తూ కొందరు పోలీసులకు పట్టుబడుతున్నారు. గత శనివారం జూలురుపాడులో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో మండలానికి చెందిన వేణుగోపాల్ ద్విచక్ర వాహనంపై 17 లీటర్ల (100 ఎంఎల్ బాటిళ్ల రూపంలో) మద్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డాడు. దీంతో వారు మద్యాన్ని స్వాధీనం చేసుకొని, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన మద్యం విలువ రూ.14,300గా ఉంది. ఇలాంటి ఘటనలు జిల్లాలో చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మండలాల్లో, గ్రామాల్లో రాజకీయ నాయకులు మద్యం డంపులు ఏర్పాటు చేస్తారేమోననే అనుమానంతో అధికారులు నిఘా పెంచారు.


అడుగడుగునా నిఘా..

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఆరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట, భద్రాచలం ఏరియాల్లో మొత్తం 88 వైన్ షాపులు, 13 బార్ షాపులున్నాయి. జిల్లాలోని ప్రతి చెక్‌పోస్టు దగ్గర ఇద్దరు ఎక్సైజ్ కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. రూట్ వాచ్‌లలో ఎక్సైజ్ అధికారులతో పాటుగా సిబ్బంది కూడా విధులు నిర్వహిస్తూ, వాహన తనిఖీల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలోని బెల్టు షాపులపై 87 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎక్సైజ్, ప్రొబిహిషన్ సూపరింటెండెంట్ జానయ్య తెలిపారు. అవసరం లేకుండా ఎక్కువ మొత్తంలో మద్యం కొనుగోలు చేసే వారి సమాచారం వచ్చే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

గంజాయి రవాణాపై కూడా..

యువతను ఆకర్షించే ప్రయత్నంలో భాగంగా గంజాయి కూడా ఇచ్చి ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. దీంతో గంజాయి రవాణాపై కూడా నిఘాను పెట్టి, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు రాత్రులు సైతం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవలి కాలంలో ఇల్లెందు క్రాస్ రోడ్డులో బైక్‌లపై గంజాయిని తీసుకొస్తూ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు అధికారులకు చిక్కారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేశారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, ప్రలోభాలకు గురికాకుండా యువత మంచి మార్గంలో నడవాలని అధికారులు సూచిస్తున్నారు. అశ్వారావుపేట, భద్రాచలం వంటి చెక్‌పోస్టుల్లో 24 గంటలూ ఎక్సైజ్ అధికారులు విధులు నిర్వర్తిస్తూ మద్యం రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నిఘా పెంచాం



జిల్లాలో మద్యం అక్రమ రవాణా జరగకుండా నిఘాను పటిష్టం చేశాం. చెక్‌పోస్టుల వద్ద, రూట్ వాచ్‌లలో సిబ్బందికి విధులు కేటాయించాం. ఇప్పటికే బెల్టు షాపులపై 87 కేసులు నమోదు చేశాం . మద్యం డంప్‌ల ఏర్పాటుపై సమాచారం తీసుకుంటున్నాం. మద్యంతో ప్రభావితం చేసే వీలు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

–జానయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్, కొత్తగూడెం

నాణ్యమైన ఇంధనం వాడాలి

ఎస్పీ డాక్టర్ వినీత్



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ వినీత్

ఇల్లెందు: వినియోగదారులు నాణ్యమైన ఇంధనం వినియోగించి, వాహనాలను మన్నికగా ఉంచుకోవాలని ఎస్పీ డాక్టర్ జి. వినీత్ సూచించారు. బుధవారం ఇల్లెందులో పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్‌ను, పోలీస్ గెస్ట్ హౌస్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోలీసు సిబ్బంది సంక్షేమ కోసం నిర్వహించే ఈ బంక్ దిగ్విజయంగా నడిచేలా ప్రజలు సహకరించాలని కోరారు. అనారోగ్యం బారిన పడిన పోలీసులు, విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు కుటుంబాలకు ఈ బంక్‌లో అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిబంధనలు పాటించాలని చెప్పారు. గడిచిన ఎన్నికలతో పోలిస్తే ఈ దఫా ఓటింగ్ శాతం పెరగాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటును ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ. 3.20 కోట్ల నగదును సీజ్ చేసి, కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌లో అప్పగించినట్లు వివరించారు. సోషల్ మీడియాలో ఇతరుల మనోభావాలు దెబ్బ తినేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నవంబర్ 1న ఇల్లెందులోని మొట్లగూడెంలో సీఎం కేసీఆర్ బహిరంగ సభకు హాజరు కానుండగా, సభాస్థలిని ఎస్పీ పరిశీలించారు. సభా వేదిక, హెలీప్యాడ్, పార్కింగ్ స్థలం తదితర విషయాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో అడిషనల్ ఎస్పీలు టి.సాయి మనోహర్, విజయబాబు, డీఎస్పీ ఎస్‌వీ రమణమూర్తి, సీఐలు టి. కరుణాకర్, రవీందర్, ఇంద్రసేనారెడ్డి, ఆర్‌ఐలు కామరాజు, కృష్ణారావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'దళితబంధు'వుల ఆగ్రహం


- పథకం ఇప్పిస్తానని రూ.3.5 లక్షలు వసూలు చేసిన అధికార పార్టీ నాయకుడు
- పేరు లేక, డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో నాయకుడి కారు లాక్కెళ్లిన బాధితులు



బాధితులు లాక్కున్న అధికార పార్టీ నాయకుడి కారు

జూలూరుపాడు: దళితబంధు ఇప్పిస్తానని డబ్బులు కాజేసిన నాయకుడిని బుధవారం బాధితులు నిలదీశారు. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన సోదరులు నల్లగట్ల రాములు, నల్లగట్ల జమలయ్య వద్ద కొమ్ముగూడేనికి చెందిన అధికార పార్టీ నాయకుడు దేవీలాల్ నాయక్ డబ్బులు వసూళ్లు చేశాడు. రాములు రూ.2.50 లక్షలు, జమలయ్య రూ.లక్ష మొత్తం రూ.3.50 తీసుకున్నాడు. దళితబంధు యూనిట్ ఇప్పిస్తే ఒక్కొక్కరు రూ.2.50 లక్షల వరకు ఇవ్వాలని దేవీలాల్ నాయక్ ఒప్పంద పత్రం రాసి ఇచ్చాడు. దళితబంధు రాకపోవడంతో కొన్ని నెలలుగా అతని చుట్టూ తిరుగుతున్న బాధితులు బుధవారం జూలూరుపాడు సెంటర్‌లో నిలదీశారు. అతని కారు లాక్కొని, తమకు డబ్బులు ఇచ్చి తీసుకెళ్లాలని హెచ్చరించారు.


బంగారం తాకట్టు పెట్టి..



దళితబంధు కోసం భార్య మెడలోని నానుతాడు, చెవి దిద్దులు, ఇంట్లో ఉన్న బంగారు నగలను తాకట్టు పెట్టి రూ.లక్ష అప్పు తెచ్చి ఇచ్చాను. ఆ తర్వాత రూ 1.30 లక్షలు ఇస్తానని చెప్పాను. దళితబంధు రాకపోతే డబ్బులు తిరిగి ఇస్తానని స్టాంప్ పేపర్‌పై దేవీలాల్ నాయక్ రాసి ఇచ్చాడు. ఇప్పుడు దళితబంధు రాలేదు. ఐదు నెలలుగా డబ్బులు ఇవ్వకుండా తిరుగుతున్నాడు.

–నల్లగట్ల జమలయ్య, వెంగన్నపాలెం గ్రామం

రూ.2.50 లక్షలు ఇచ్చాను



దళితబంధు ఇప్పిస్తానని చెపితే తొమ్మిది నెలల క్రితం దేవీలాల్ నాయక్‌కు ఒకేసారి రూ 2.50 లక్షలు ఇచ్చాను. లబ్ధిదారుల జాబితాలో నా పేరు రాలేదని అడిగితే మరో లిస్ట్ వస్తుందని చెప్పాడు. ఇప్పుడు అడిగితే ఎన్నికల కోడ్ వచ్చిందని, ఎన్నికల తర్వాత ఇస్తారని చెబుతున్నాడు. డబ్బులు అడిగితే తన వద్ద లేవని, ఏమీ చేసుకుంటావో చేసుకో అంటూ బుకాయిస్తున్నాడు.

–నల్లగట్ల రాములు, వెంగన్నపాలెం

అభివృద్ధి చేసేందుకే రాజకీయాల్లోకి..

- ప్రతీకారం తీర్చుకోవడం మా అభిమతం కాదు
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్




మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: రాజకీయాల్లోకి వచ్చింది కేవలం అభివృద్ధి చేయడానికి మాత్రమే తప్ప ప్రతీకారం తీర్చుకోవడం తమ పని కాదని ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన బూత్‌లెవల్ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ ఒక పెద్ద మనిషి పాలేరు ప్రజల కాళ్లు కడుగుతానని తిరిగి, ఇప్పుడు ఖమ్మం ప్రజల కాళ్లు కడుగుతానంటూ కొత్తరాగం ఎంచుకున్నారని తెలిపారు. తన వెంట ఉన్న వారిని రౌడీలు, దొంగలుగా చిత్రీకరిస్తున్నా, వారందరూ ప్రగతిని కాంక్షించే వాళ్లేనని స్పష్టం వెల్లడించారు. కానీ సదరు పెద్ద మనిషి వద్ద బ్యాంక్‌ను ముంచిన వారు, రౌడీ షీటర్లు ఉన్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవరికీ భయపడాల్సిన పని లేదని.. చేసిన అభివృద్ధిని వివరించడంలో నిమగ్నం కావాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఆ తర్వాత ఖమ్మం నెహ్రూనగర్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పువ్వాడ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికలు అభివృద్ధికి, అహంకారానికి మధ్య జరుగుతున్నాయని తెలిపారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం జరుగుతున్న పోరాటంలో అభివృద్ధే గెలుస్తుందన్నారు. అనంతరం ప్రముఖ వైద్యుడు మదన్‌సింగ్‌ను పువ్వాడ అజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

నిజాయితీని నా జీవితంలో వీడను..


ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: నిజాయితీ, నిబద్ధతను జీవితాంతం వదిలిపెట్టనని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మం 54వ డివిజన్ కార్పొరేటర్ మిక్కిలినేని మంజులనరేందర్ ఆధ్వర్యాన బుధవారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికలు ఖమ్మం ప్రజలకు, అక్రమ సంపాదనతో అరాచకాలు సృష్టించే వ్యక్తుల మధ్య జరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటి అరాచక శక్తులకు అడ్డుకట్ట వేసేందుకే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ తనను పంపించారని చెప్పారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. అప్పుడు అవినీతి, సెటిల్‌మెంట్లకు చరమగీతం పాడుతామన్నారు. ఆ తర్వాత 8, 25, 32, 39, 54వ డివిజన్లలో జరిగిన సమ్మేళనాల్లో కూడా తుమ్మల మాట్లాడారు. అలాగే, డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, రామకోటేశ్వరరావు తదితరులను కలిశారు. ఈ సమావేశాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ సైదులు, కమర్తపు మురళి, చావా నారాయణరావు, నాయకులు పొదిల రవికుమార్, కొప్పెర ఉపేందర్, నాగండ్ల దీపక్‌చౌదరి, సోమనాథం, వడ్డెబోయిన నర్సింహారావు, కొత్తపల్లి శ్రీనివాస్, హుస్సేన్, అమ్జద్, జంగం భాస్కర్, మారగాని వెంకట్, రఘు, గట్టు నితీశ్, వెన్నం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతి



చిట్టిమల్ల సురేష్ (ఫైల్)

పినపాక: గోదావరిలో బతుకమ్మల నిమజ్జనానికి వెళ్లి రెండు రోజులు క్రితం గల్లంతైన చిట్టిమల్ల సురేష్ (35) మృతదేహం బుధవారం అశ్వాపురం మండలంలో గోదావరి ఒడ్డున లభ్యమైంది. జాలర్ల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌పై వెళ్తుండగా ఫిట్స్ వచ్చి..

ఇల్లెందు: ద్విచక్రవాహనం మీద వెళుతుండగా ఫిట్స్ వచ్చి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తాటి దావీదు(35) అనే వ్యక్తి కొత్తగూడెంలోని లక్ష్మీదేవిపల్లి నుంచి రాఘబోయినగూడెం పంచాయతీ నారాయణపురం గ్రామానికి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో రాఘబోయినగూడెం వద్దకు రాగా ఫిట్స్ వచ్చాయి. దీంతో బైక్ అదుపు తప్పి పడిపోగా దావీదుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి సీతారాములు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

టేకులపల్లి: చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతి చెందాడు. బోడు ఎస్‌ఐ బత్తిని రంజిత్ కథనం ప్రకారం... మండలంలోని వజ్జానిగూడెం గ్రామానికి చెందిన సూర్నపాక సురేష్(45), తాటి నాగమణిలకు సుమారు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మూడు నెలల నుంచి సురేష్‌కు మెడ నరాలు దెబ్బ తినడంతో చికిత్స పొందుతున్నాడు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతున్నాడు. రోజువారీ తీసుకునే మందులను మంగళవారం అధిక మోతాదులో తీసుకోవడంతో కళ్లు తిరిగి కింద పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి కొనుగోళ్లకు రంగం సిద్ధం

ఖమ్మంవ్యవసాయం: పత్తి కొనుగోళ్ల కోసం రూపొందించిన సాఫ్ట్‌వేర్ పనితీరును కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) బుధవారం నుంచి పరీక్షిస్తోంది. ఈ ఏడాది పత్తి కొనుగోళ్లలో కొత్త నిబంధనలు తీసుకురాగా, ఎంపిక చేసిన కేంద్రాల్లో ట్రయల్స్ ప్రారంభించారు. పత్తి విక్రయించే రైతు వేలిముద్రల నమోదు, అవసరమైతే ఐరిష్ పరీక్షలు నిర్వహించటం వంటివి చేయాల్సి ఉంది. తద్వారా రైతు సొంత భూమిలోనే పత్తిసాగు చేసినట్లు గుర్తించి కొనుగోలు చేస్తారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను సీసీఐ సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానం చేసి పరీక్షించారు. తొలిరోజు సీసీఐ అధికారులు వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో పరీక్షించగా, ఖమ్మం జిల్లాలో రెండు, మూడు రోజుల్లో మొదలుపెట్టే అవకాశముందని అధికారులు తెలిపారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

భద్రాచలంఅర్బన్: ద్విచక్రవాహనాన్ని అపహరించిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్సై పీవీఎన్ రావు కథనం ప్రకారం .. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన అరికల రాజశేఖర్ ద్విచక్రవాహనం చోరీకి గురికాగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ క్రమంలో బుధవారం బ్రిడ్జి సెంటర్‌లో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో భద్రాచలం నుంచి సారపాక వైపునకు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆపి వాహనానికి సంబంధించిన పత్రాలను చూపించాలని కోరగా.. పత్రాలు చూపించలేదు. పొంతన లేని సమాధానాలు చెబుతుండటంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ద్విచక్రవాహనం అపహరించినట్లు అంగీకరించాడు. చోరీ ఘటనలో అతనితో పాటు తుర్రం వెంకటేశ్వర్లు, బోయిని దుర్గాప్రసాద్, తుర్రం యుగంధర్‌లు కూడా ఉన్నారని తెలిపాడు. వారి కోసం గాలించగా తుర్రం యుగంధర్ అనే వ్యక్తి మినహా మిగిలిన ఇద్దరు దొరికారు. దీంతో ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

డీజే శబ్దాలతో అస్వస్థత

నేలకొండపల్లి: డీజే మోతల కారణంగా మండలంలోని రాజేశ్వరపురంలో ఓ వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. గ్రామంలో దుర్గాదేవి నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి డీజే శబ్దాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి డీజే పాటల వద్ద ఆడుతూ సందడి చేయగా.. ఆ శబ్దానికి కాసేపటి తర్వాత అస్వస్థతకు గురయ్యాడు. గుండెలో స్వల్పంగా నొప్పి వస్తోందని చెప్పడంతో సహచరులు స్థానికంగా వైద్య పరీక్షలు చేయించి ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మూడో రోజుకు చేరిన కోటమైసమ్మ జాతర



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



జాతరలో జనసందోహం

కారేపల్లి: కొలిచిన వారికి కొంగు బంగారంలా విలసిల్లుతున్న శ్రీ కోటమైసమ్మ తల్లి జాతర బుధవారం మూడో రోజుకు చేరింది. కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో దసరా సందర్భంగా మొదలైన జాతరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ, పర్సా ట్రస్టు ఆధ్వర్యాన అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యాసంస్థలు గురువారం నుంచి ప్రారంభం కానుండటంతో బుధవారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. దేవాదాయ శాఖ ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు ఆధ్వర్యాన పర్యవేక్షించగా సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి, కామేపల్లి ఎస్‌ఐలు పుష్పాల రామారావు, ప్రవీణ్ కుమార్ బందోబస్తులో పాల్గొన్నారు.

రూ.3.83 లక్షల నగదు సీజ్

దమ్మపేట: ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం పోలీస్ అధికారులు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును సీజ్ చేస్తున్నారు. బుధవారం జిల్లాలోని పలుచోట్ల రూ.3,83,550ను సీజ్ చేశారు. దమ్మపేట మండల పరిధిలోని మందలపల్లి క్రాస్ రోడ్డు చెక్‌పోస్ట్ వద్ద రూ.1,40,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా చింతలపూడి నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి ద్విచక్ర వాహనంపై వస్తున్న బంధన్ బ్యాంకు సిబ్బంది నుంచి నగదు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు.

అశ్వారావుపేటలో రూ.1.12 లక్షలు..

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట సరిహద్దు చెక్‌పోస్టు వద్ద బుధవారం రూ.1,12,500 నగదును పోలీసులు సీజ్ చేశారు. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన సంజయ్ కుమార్ కారులో కుక్కునూరు వైపు నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై పి.శ్రీకాంత్ తెలిపారు.

భద్రాచలంలో రూ.1.30 లక్షలు..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో బుధవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.78 వేలు, రూ.52,800... మొత్తం రూ.1,30,800 నగదు సీజ్ చేసినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

చర్ల: మైనర్ విద్యార్థినిని లైంగికంగా వేధించడంతోపాటు అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా జడ్జి, పోక్సో స్పెషల్ జడ్జి శ్యామ్ శ్రీ బుధవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తేగడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న గొమ్ముగూడేనికి చెందిన విద్యార్థినిని అదే గ్రామానికి చెందిన అవుల వెంకటరెడ్డి లైంగికంగా వేధించడంతోపాటు అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఓ విద్యార్థిని గమనించి హైస్కూల్‌లోని కంప్లైంట్ బాక్సులో లెటర్ వేసింది. పరిశీలించిన హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు 2021, నవంబర్ 20న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు వెంకటరెడ్డిపై చార్జిషీటు దాఖలు చేశారు. కాగా 12 మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రావి విజయకుమార్ వాదించగా, లైజన్ ఆఫీసర్ ఎం.హరిగోపాల్, కోర్టు కానిస్టేబుల్ సి.సైదులు సహకరించారు.

బెల్టు షాప్‌లో మద్యం పట్టివేత

కారేపల్లి: ఎన్నికల కోడ్ నేపథ్యాన కారేపల్లి పోలీసులు బెల్టు షాపుల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని భాగ్యనగర్‌తండా సర్కిల్‌లో ఉన్న ఓ బెల్టు షాపు నుంచి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

2014 టు 2024... నారా – పవన్ ఉమ్మడి సమర్పణలో...

మోసానికి మళ్లీ రెడీ

- మరోసారి మోసపూరిత హామీలతో ఉమ్మడి మేనిఫెస్టోకు బాబు– పవన్ రెడీ
- 2014 ఎన్నికల్లో కూడా పవన్ ఫొటోతో మేనిఫెస్టోను విడుదల చేసిన టీడీపీ
- హామీలంటూ కరపత్రాలపై చంద్రబాబు–పవన్ ఉమ్మడి సంతకాలు
- ఎన్నికల్లో గెలిచాక హామీలు గాలికి...

(సాక్షి, అమరావతి)



2014 ఎన్నికలకు ముందు నారా చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ ఫొటోలతో పత్రికలకు విడుదల చేసిన టీడీపీ మేనిఫెస్టో

పదేళ్ల కిందట కలసికట్టుగా మేనిఫెస్టో విడుదల చేసి, ఎన్నికల్లో గెలిచాక దాన్ని చెత్తబుట్టలో పడేసిన చంద్రబాబు– పవన్ కల్యాణ్‌ల ద్వయం... మళ్లీ అదే మోసానికి ఒడిగడుతోంది. పైపెచ్చు ఇదేదో ఇప్పుడే తొలిసారి చేస్తున్నట్లుగా... తెలుగుదేశం– జనసేన తొలి ఉమ్మడి మేనిఫెస్టో అనే కలరింగుతో జవన్ కల్యాణ్ ఊదరగొట్టేస్తున్నారు. మరి 2014 ఎన్నికల మేనిఫెస్టో సంగతేంటి పవన్ కల్యాణ్? ఆ మేనిఫెస్టోపై చంద్రబాబుతో పాటు మీ ఫొటో కూడా ఉందిగా? 'టీడీపీకి ఓట్లేయండి.. హామీలు అమలు చేసే బాధ్యత నాది'అని 2014 ఎన్నికల్లో బహిరంగంగా టీడీపీ తరఫున ప్రజలకు పూచీకత్తుగా నిలిచారుగా? టీడీపీ గెలిచిన తరవాత హామీలను అమలు చేయకపోయినా ఒక్కసారైనా ప్రశ్నించారా? అసలు మేనిఫెస్టోనే కనిపించకుండా వెబ్‌సైట్ నుంచి మాయం చేసేసిన చంద్రబాబు నాయుడిని ఎన్నడైనా నిలదీశారా? మళ్లీ ఇపుడు ఏం మొహం పెట్టుకుని ఉమ్మడి మేనిఫెస్టో కథ అల్లుతున్నారు? మీరు తెలుగుదేశాన్ని నిలదీస్తారంటే నమ్మేదెవరు? మీరు హీరోలా ఒక్క సీన్లోనూ కనిపించని సినిమాను అదే స్క్రీన్‌ప్లే, డైలాగులతో మళ్లీ మళ్లీ జనం ముందుకు తెస్తే మాత్రం చూసేదెవరు?

ఎప్పుడో పదేళ్ల క్రితం జరిగింది కాబట్టి ఇప్పుడు జనం ఆ మోసాన్ని మర్చిపోయి ఉంటారులే అనుకుంటూ చంద్రబాబు నాయుడు– పవన్ కల్యాణ్ మళ్లీ అదే స్కీముతో జనం ముందుకు రావటం ఆంధ్రప్రదేశ్‌లో ఇపుడు చర్చనీయమవుతోంది. పదేళ్ల కిందట 2014 ఎన్నికల్లో... టీడీపీ ఇచ్చిన హామీలను అమలు చేయించే బాధ్యతను నెత్తికెత్తుకున్నానని, అమలు చేయకుంటే నిలదీసే బాధ్యత కూడా తనదేనంటూ పవన్‌కళ్యాణ్ ప్రజలకు వాగ్దానమిచ్చారు. 2014–19 మధ్య ఒక్క హామీ విషయంలో కూడా దాన్ని నిలబెట్టుకోకుండా... మళ్లీ ఇపుడు పదేళ్ల కిందటి మాటలే చెబుతుండటం జనాన్ని వంచించటం తప్ప మరొకటి కాదనేది రాజకీయ విశ్లేషకుల మాట. వాస్తవానికి 2014 ఎన్నికల్లో బీజేపీతో కలిసి టీడీపీ– జనసేన ఉమ్మడిగా పోటీ చేశాయి. అప్పట్లో తాము అధికారంలోకి వస్తే రైతు రుణాల మాఫీ చేస్తామని, డ్వాక్రా రుణాలన్నీ బేషరత్తుగా మాఫీ చేస్తామని, ఇంటింటికీ ఓ ఉద్యోగమిస్తామని, లేనిపక్షంలో నిరుద్యోగ భృతి ఇస్తామని బోలెడన్ని ఆకర్షణీయమైన హామీలు గుప్పించారు. ఈ మోసపూరిత హామీలకు పవన్ కల్యాణ్ గ్యారంటీ ఇచ్చారు. బీజేపీ కూడా వీరితో కలిసి పోటీ చేయటంతో ఈ కూటమి ఎన్నికల్లో గెలిచింది. ఆ వెంటనే చంద్రబాబు హామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టేశారు. ఏకంగా మేనిఫెస్టోనే తమ పార్టీ వెబ్‌సైట్ నుంచి తీసేశారు. పవన్ సైతం ఈ విషయాన్ని గమనించనట్టే ఉండిపోయారు. అసలు ఏ హామీ గురించి కూడా ఒక్క నాడూ ప్రశ్నించలేదు. గెలిచిన వెంటనే పవన్ ప్యాకేజీ అందుకుని తన వేషాన్ని చాలించారన్న విమర్శలు అప్పట్లోనే వచ్చాయి.

మాఫీ జరగకపోయినా పవన్ గప్‌చుప్...

అధికారంలోకి వచ్చాక... బేషరతుగా డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తామని చెప్పి, ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో 70 లక్షల మంది డ్వాక్రా మహిళల్లో ఎవ్వరికీ పైసా రుణం కూడా చంద్రబాబు ప్రభుత్వం మాఫీ చేయలేదు. రైతు రుణ మాఫీ విషయంలోనూ అంతే. 2014 అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో రైతుల పేరిట రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలుండగా, కోటయ్య కమిటీ పేరుతో కాలయాపన చేసి, ఆ ఐదేళ్లలో కేవలం రూ.15 వేల కోట్ల రుణాలను మాత్రమే నాటి చంద్రబాబు ప్రభుత్వం చెల్లించింది. ఎన్నికల ముందు రైతులకిచ్చిన రుణ బాండ్లు చెల్లని కాగితాలయ్యాయి. బాబు రుణ మాఫీ మోసానికి కరువు కూడా తోడవటంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి రాష్ట్రమంతటా వేలాది ఎకరాలు పంటలు కూడ వేయక బీడుగా మారాయి. అయినా పవన్‌కళ్యాణ్ ఏనాడు నాటి చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఇంటింటికీ ఉద్యోగమిస్తామన్న చంద్రబాబు ప్రభుత్వం దాన్ని గాలికొదిలేసింది. నిరుద్యగ భృతి కూడా అమలు చేయలేదు. ఇలా లక్షల మంది యువతను మోసం చేసినా పవన్‌కళ్యాణ్ కనీసం దాని గురించి ప్రశ్నించలేదు. చివరకు.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాపు రిజర్వేషన్ల హామీ అమలు చేయకపోయినా ప్రశ్నించకపోవడాన్ని పలువురు కాపు నేతలు గుర్తు చేస్తున్నారు.

జగన్ తీరే వేరు.. తొలిఏడాదే 80 శాతం, నాలుగేళ్లకు 99 శాతం!

ఎన్నికల్లో గెలిచాక మేనిఫెస్టోను మాయం చేసిన చంద్రబాబు– పవన్‌కల్యాణ్ ఒకపక్క ఉంటే.... 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గెలిచాక తు.చ. తప్పకుండా అమలు చేసి చూపించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోవైపున నిలిచిన విషయాన్ని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలోనే 80 శాతం హామీలను అమలు చేసి చూపించారు. నాలుగేళ్ల పూర్తయ్యే సరికి 99 శాతం హామీలను అమలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన కోవిడ్ సంక్షోభంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు దెబ్బతిన్నా కూడా హామీల అమల్లో ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. ఇంతటి చిత్తశుద్ధికి మోకాలడ్డుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తో పాటు వారికి అనుకూలంగా పనిచేసే కొన్ని పత్రికలు తరుచూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అవాస్తవ కథనాలు ప్రచురించడం, వాటి ఆధారంగా కొందరు నేతలు వాటిపై కేంద్రానికి ఫిర్యాదులు చేస్తూ రాష్ట్రానికి నిబంధనల ప్రకారం రావాల్సిన నిధులను కేంద్రం నుంచి రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేయటం దేశ రాజకీయాల్లో ఏపీలో తప్ప ఎక్కడా లేదని పలువురు గుర్తు చేస్తున్నారు.

'దేవరగట్టు' రక్తసిక్తం



బన్ని ఉత్సవంలో అపశృతి

- చెట్టు కొమ్మ విరిగి పడి ముగ్గురు మృతి
- వైభవంగా మాళ మల్లేశ్వరుని కల్యాణోత్సవం

హొళగుంద/ఆలూరు రూరల్ (కర్నూలు): దేవరగట్టు రక్తసిక్తమైంది. ఎప్పటిలానే సంప్రదాయం పైచేయి సాధించింది. కర్రలు కరాళనృత్యం చేయగా, 84 మందికి పైగా గాయపడ్డారు. బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు ఓ చెట్టుపైకి ఎక్కిన భక్తుల్లో కొమ్మ విరిగిపడడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత డోలు, మేళతాళాలతో ఇనుప తొడుగులు తొడిగిన కర్రలు, అగ్గి కాగడాలు, దివిటీలతో కొండ పైకి చేరిన నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు మాత మాళమ్మ, మల్లేశ్వరునికి నెరణికి పురోహితులు, ఆలయ పూజారులు అత్యంత వైభవంగా కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో పాటు పల్లకీని మల్లప్ప గుడిలోని సింహాసన కట్ట మీద అధిష్టించారు. అక్కడి నుంచి మొదలైన జైత్రయాత్ర ఆద్యంతం ఒళ్లు జలదరించేలా ఉత్కంఠగా సాగింది.

చెట్టు కొమ్మ విరిగిపడి ముగ్గురు మృతి..

ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులు సత్యానారాయణ కట్టపై ఉన్న రావి చెట్టుపై కూర్చున్న కొమ్మ విరిగి పడడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు.

కర్రల సమరంలో 84 మందికి గాయాలు

విజయదశమిని పురస్కరించుకుని మంగళవా రం రాత్రి దేవరగట్టులో జరిగిన బన్ని మహోత్సవంలో ఆదినుంచి వస్తున్న సంప్రదాయమే గెలిచింది. విజయోత్సవంలో భాగంగా జరిగిన జైత్రయాత్రలో గట్టుపై రక్తం చిందింది. ఉత్సవంలో 84 మందికి గాయాలు కాగా అందులో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళ వారం అర్ధరాత్రి ప్రారంభమైన మాళ మల్లేశ్వరస్వామి జైత్రయాత్ర బుధవారం తెల్లవారు జాము వరకు జరిగింది.

అమిత్‌షాతో పవన్‌కల్యాణ్ భేటీ!

తెలంగాణలో జనసేనతో పొత్తు, సీట్ల సర్దుబాటుపై సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షాతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. జనసేన, బీజేపీ కలసి తెలంగాణలో పోటీ చేస్తాయన్న ప్రచారం నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. బుధవారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి నివాసంలో అమిత్‌షాతో కిషన్‌రెడ్డి, పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్ సమావేశమయ్యారు. సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో రెండు పార్టీల పొత్తులు, సీట్ల సర్దుబాటు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. అనంతరం ఇరు పార్టీల నేతలు మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు.

20 స్థానాల్లో పోటీ చేసేందుకు జనసేన ఆసక్తి?

రాష్ట్రంలో 32కి పైగా సీట్లలో పోటీ చేసేందుకు జనసేన ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే జనసేనకు 32 సీట్లు కేటాయిస్తే బీజేపీని నమ్ముకున్న వారికి అన్యాయం జరిగే అవకాశం ఉన్నట్లు బీజేపీ నేతలు అమిత్‌షా దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో కనీసం 20 స్థానాల్లో జనసేన అభ్యర్థుల్ని నిలబెట్టాలనే అభ్యర్థనను పవన్ కల్యాణ్ అమిత్‌షా ముందు ఉంచినట్లు సమాచారం. ఈ విషయంపై తుది నిర్ణయంతో పాటు జనసేనకు సీట్ల సర్దుబాటు వంటి అంశాలన్నీ నవంబర్ 1వ తేదీన జరిగే సీఈసీ సమావేశం అనంతరం తేలనున్నాయి.

పవన్ ట్రాప్‌లో తెలంగాణ బీజేపీ?

- చంద్రబాబు చేతుల్లో పావుకు ఎందుకింత ప్రాధాన్యం
- తెలంగాణలో ఏమాత్రం బలంలేని జనసేనతో పొత్తుకు ఎందుకీ వెంపర్లాట...
- బీజేపీ నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి

సాక్షి, హైదరాబాద్: టీడీపీ అధినేత చంద్రబాబు చేతుల్లో పావుగా పనిచేస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ట్రాప్‌లో తెలంగాణ బీజేపీ పడుతోందా? అన్న సందేహాలు కమలనాథులను, ఆ పార్టీ శ్రేణులను వెంటాడుతున్నాయి. తెలంగాణలో ఏ మాత్రం బలం లేని,, కనీసం కేడర్ కూడా లేని జనసేనతో అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. మరో 35 రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా.. అర్ధంతరంగా జనసేనతో బీజేపీ పొత్తు అని, ఆ పార్టీ ఏకంగా 32 సీట్లు కోరుతోందనే ప్రచారం పార్టీ శ్రేణులను కలవరానికి గురి చేస్తోంది. తెలంగాణలో పొత్తులపై చర్చ అంటూ బుధవారం ఏకంగా కేంద్రహోంమంత్రి అమిత్‌షా సమక్షంలోనే పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమావేశం కావడం బీజేపీ కేడర్‌ను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. తెలంగాణలో కనీస బలం లేని జనసేనతో పొత్తుకు ఎందుకీ వెంపర్లాట అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఏపీలో పొత్తుకోసం ఒత్తిడి తెచ్చేందుకేనా..

ఏపీలో బీజేపీతో టీడీపీ–జనసేన పొత్తు కోసం ఒత్తిడి తెచ్చేందుకే తెలంగాణలో బీజేపీతో కలిసి జనసేన పోటీ చేస్తోందన్న వాదనలు బలంగా ఉన్నాయి. ఇందుకు తెరవెనక టీడీపీ అధినేత చంద్రబాబు పాత్ర ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పవన్ కల్యాణ్‌తో కిషన్‌రెడ్డి, డా.లక్ష్మణ్ భేటీకి రెండురోజుల ముందు... వారిద్దరితో గతంలో టీడీపీ–బీజేపీ పొత్తు ఖరారులో కీలకపాత్ర వహించిన ఓ బడాబాబు(రాజ్యాంగ పదవి నిర్వహించి ఇటీవల పదవీ విరమణ చేసిన వ్యక్తి) భేటీ అయ్యారన్న వార్త ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎన్నో ఏళ్ల టీడీపీ పొత్తును వదిలించుకుని, 2018లో ఒంటరిగా పోటీ చేసిన బీజేపీకి ఇప్పుడు మళ్లీ జనసేనతో పొత్తు అవసరం ఏమొచ్చిందన్న ప్రశ్నలు బీజేపీ నాయకులు, కార్యకర్తల నుంచి ఇప్పుడు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

నేటి నుంచి 'సామాజిక సాధికార యాత్ర'

- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఏపీ సీఎం జగన్ చేసిన మేలును వివరిస్తాం..
- ఏపీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతల వెల్లడి

సాక్షి, అమరావతి: దేశ చరిత్రలో సామాజిక న్యాయాన్ని, ధర్మాన్ని పాటించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఏపీ మంత్రులు జోగి రమేష్, ఆదిమూలపు సురేశ్, మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారు (మైనార్టీ వ్యవహారాలు) జియావుద్దీన్, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతు నాయక్‌లు ప్రశంసించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్ చేసిన మంచిని వివరించి.. ఆయా వర్గాలను ఏకం చేయాలన్న లక్ష్యంతో సామాజిక సాధికార యాత్ర పేరుతో బస్సు యాత్రను వైఎస్సార్‌సీపీ చేపట్టిందన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్ర పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం సామాజిక సాధికార యాత్ర బస్సుకు పూజలు చేసి, ప్రారంభించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఏపీ వ్యాప్తంగా మూడు ప్రాంతాల్లో మూడు విడతలుగా సామాజిక సాధికార యాత్ర జరుగుతుందన్నారు. తొలి విడత యాత్ర గురువారం ప్రారంభమవుతుందని.. నవంబర్ 9న ముగుస్తుందని చెప్పారు. రోజూ మూడు ప్రాంతాల్లో ఒక్కో నియోజకవర్గంలో ఈ యాత్ర జరుగుతుందని.. సాయంత్రం బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. తొలి విడతలో మూడు ప్రాంతాల్లోని 39 నియోజకవర్గాల్లో ఈ యాత్ర సాగుతుందని వివరించారు. యాత్రలో పేదలందరినీ ఏకం చేసి పెత్తందార్లపై రణభేరి మోగిస్తామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల సంగ్రామంలో.. పేదల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు దన్నుగా నిలిచి, పెత్తందార్లను మట్టికరిపించాలని పిలుపునిచ్చారు.

జిల్లా వార్తలు

108లో ఉద్యోగాలకు నేడు ఇంటర్వ్యూలు

నవభారత్: హైదరాబాద్‌లో నడుస్తున్న 108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల నియామకానికి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ తెలిపారు. కొత్తగూడెం రామవరంలోని ఎంసీహెచ్‌లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. లైఫ్ సైన్స్, బీఎస్సీ నర్సింగ్, బీఫార్మసీ, డీఫార్మసీ, ఏఎన్ఎం కోర్సులు చేసిన వారు అర్హులని, వివరాల కోసం 91210 03246 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రామయ్య నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీకి చెందిన భక్తులు బుధవారం విరాళం అందజేశారు. జంగారెడ్డిగూడేనికి చెందిన బల్లే సత్యనారాయణ, ధనలక్ష్మి రూ.1,11,123 ఈఓ రమాదేవికి అందజేయగా ఆమె రశీదు ఇచ్చి స్వామి దర్శనం చేయించారు.

పొదుపు పథకాలపై ప్రజలకు అవగాహన



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

చండ్రుగొండ: కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా అమలు చేస్తున్న పొదుపు పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి భాగస్వాములను చేయాలని తపాలా శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్ చౌదరి సూచించారు. చండ్రుగొండలోని సబ్‌పోస్టాఫీస్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ తపాలా బీమా, రికరింగ్ డిపాజిట్, సుకన్య సమృద్ధి తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, తద్వారా లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. సమావేశంలో ఉద్యోగులు సత్యనారాయణ, రిజ్వానా, రాణి, రఘు, గణేశ్, రవితేజ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పత్తి రైతుకు ని'బంధనాలు'

- సీసీఐ ప్రకటనతో ఆందోళన
- ఆధార్ అనుసంధానం తప్పనిసరి
- వేలిముద్ర లేదంటే ఐరిష్ ద్వారా నిర్ధారణ
- కౌలు రైతులకు మళ్లీ మొండిచేయే



ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పత్తి

ఖమ్మంవ్యవసాయం: పత్తి రైతులకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొత్త కష్టాలను తెచ్చిపెట్టింది. గతంతో పోలిస్తే కొనుగోళ్లలో కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వం తేమశాతం ఆధారంగా పత్తి క్వింటాకు గరిష్టంగా రూ.7,020గా ధర నిర్ణయించగా మార్కెట్లలో వ్యాపారులు రూ.6 వేలకు మించి చెల్లించడం లేదు. ఈ క్రమంలో సీసీఐని రంగంలోకి దింపాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ, సీసీఐ నిబంధనల కారణంగా రైతుల్లో ఆందోళన మొదలైంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రధాన పంటగా రైతులు పత్తి సాగు చేస్తుండగా రెండు జిల్లాల్లో కలిపి ఈ ఏడాది 3,85,598 ఎకరాల్లో సాగైంది. తద్వారా 2,84,990 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ధర వెనకడుగు వేయడంతోనే..

పత్తికి కనీస మద్దతు ధర రాకపోవడంతో సీసీఐ కొనుగోళ్లకు ముందుకొచ్చింది. రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా మార్కెట్‌లో అధికంగా ధర వస్తుండడంతో సీసీఐ కొనుగోళ్ల అవసరం రాలేదు. 2021–22 సంవత్సరంలో పత్తి ధర క్వింటా రూ.13 వేలుగా పలికింది. కానీ, గత ఏడాది ఆరంభంలో రూ.9 వేల వరకు పలికిన ధర ఆ తర్వాత తగ్గుతూ వచ్చింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,020 కన్నా ప్రైవేట్ మార్కెట్‌లో తక్కువ ధర పలుకుతుండడంతో సీసీఐ పత్తి కొనుగోళ్లకు సన్నద్ధమవుతోంది.

నిబంధనలన్నీ కొత్తకొత్తగా..

వ్యవసాయ శాఖ అధికారులు రైతు, పంటను ధ్రువీకరిస్తూ ఇచ్చే పత్రం ఆధారంగా రైతులు సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించేవారు. ఈ ఏడాది మాత్రం నిబంధనలను కఠినతరం చేశారు. రైతు సొంత భూమిలో పత్తి సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ నమోదు చేసి ఉండాలి. అందులో రైతు, భూమి సర్వే నంబర్లే కాక సాగు విస్తీర్ణం వివరాలు ఉండాలి. అలాగే, వ్యవసాయ శాఖ పత్తి సాగు చేసిన రైతుల వివరాలను మార్కెటింగ్ శాఖ, సీసీఐకి అప్పగించాలి. అనంతరం రైతు సీసీఐ నిర్దేశించిన విధంగా పంట విక్రయించే జిన్నింగ్ మిల్లు వద్దకు ఒక రోజు ముందు ఆధార్ కార్డుతో వెళ్తే రైతులు, పత్తి వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తారు. అలాగే, ఆధార్‌కు బ్యాంకు ఖాతా అనుసంధానమై ఉండాలి. అనంతరం ఆ రైతు వేలిముద్రలు (బయోమెట్రిక్) ద్వారా మరోసారి పరీక్షిస్తారు. ఒకవేళ వేలిముద్రల ద్వారా నిర్ధారణ కాకపోతే ఐరిష్ స్కానింగ్ చేస్తారు. ఇవన్నీ పూర్తయ్యాకే సీసీఐ కేంద్రాల్లో పంట విక్రయానికి అనుమతిస్తారు.

పత్తి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో), దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	సాగు విస్తీర్ణం	దిగుబడి
ఖమ్మం	1,85,225	1,38,918
భద్రాద్రి కొత్తగూడెం	2,00,373	1,46,072


నాణ్యత కూడా తప్పనిసరి

రైతులు తీసుకొచ్చిన పత్తి నాణ్యత కలిగి ఉండాలి. 8 నుంచి 12 శాతం మధ్య తేమ కలిగిన పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. ఎనిమిది శాతం తేమ కలిగిన పత్తి క్వింటాకు గరిష్టంగా రూ.7,020.. అంత కంటే ఎక్కువ ఉంటే ఒక్కో శాతానికి రూ.70.20 చొప్పున ధర తగ్గుతుంది. 12 శాతానికి మించి తేమ కలిగిన పత్తిని మాత్రం సీసీఐ కొనుగోలు చేయదు.

భూమి కలిగిన రైతులు మాత్రమే

సీసీఐ కేంద్రంలో కౌలు రైతులు పత్తిని విక్రయించుకునేందుకు అవకాశం లేదు. పంట భూమి కలిగిన పట్టాదారు రైతు మాత్రమే పంట అమ్ముకునే అవకాశం కల్పించారు. కౌలు రైతు పంట పండించినా, విక్రయ సమయంలో యజమాని వివరాలతో అమ్ముకోవచ్చు. సీసీఐ చెల్లించే నగదు కూడా భూయజమాని బ్యాంకు ఖాతాలోకే జమఅవుతుంది.


నిబంధనలు ఇబ్బందికరమే..



సొంత భూమి నాలుగెకరాలతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకున్నా. సీసీఐ నిబంధనలతో కౌలు భూమిలో సాగు చేసిన పత్తిని విక్రయించే పరిస్థితి లేదు. యజమానిని కోరినా వెంట వచ్చే అవకాశం లేదు. ఒకరోజు ముందే వివరాలు ఇచ్చేందుకు రమ్మనడం సరికాదు.

–దొడ్డ రామకృష్ణ, నర్సింహాపురం, చింతకాని మండలం

ఆధార్ అనుసంధానం తప్పనిసరి



ఆధార్‌కు ఖాతా, సెల్‌నంబర్ అనుసంధానమై ఉండాలి. వ్యవసాయ శాఖ పంట నమోదు చేసి ఉంటే ముందు రోజు సీసీఐ కేంద్రానికి వచ్చి వేలిముద్రలు, ఐరిష్ ద్వారా నిర్ధారించుకోవాలి. ఆ తర్వాతే నాణ్యత, నిబంధనల ప్రకారం పంట విక్రయించుకునేందుకు అవకాశం వస్తుంది.

–ఎంఏ అలీం, ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

గ్రానైట్ పరిశ్రమకు సబ్సిడీ విడుదల చేయాలి

అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ



మాట్లాడుతున్న వెంకటరమణ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాలోని గ్రానైట్ పరిశ్రమలకు ప్రభుత్వం విడుదల చేసిన సబ్సిడీ నిధులను అధికారులు విడుదల చేయాలని ది గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీస్ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ కోరారు. ఖమ్మంలోని అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 తర్వాత రాష్ట్రంలో గ్రానైట్ పరిశ్రమకు ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి, రాయల్టీ పెంచకుండా ఆదుకుందని తెలిపారు. అయితే, పదేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి పరిశ్రమలకు సబ్సిడీ మాత్రం రాలేదని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఖమ్మం జిల్లా గ్రానైట్ పరిశ్రమలకు రూ.22 కోట్ల సబ్సిడీ రావాల్సి ఉండగా, ఈ ఏడాది ఆగస్టులో విడుదల చేస్తూ జీఓ జారీ చేసినా నిధులు అందలేదని తెలిపారు. ఎన్నికల కోడ్‌తో సంబంధం లేని కారణంగా తక్షణమే సబ్సిడీ నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. అలాగే, క్వారీ లీజ్ నిబంధనలు సరళీకరించాలని, పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేసి కార్మికుల తాగునీటి కోసం మిషన్ భగీరథ కనెక్షన్లు ఇవ్వాలని వెంకటరమణ తెలిపారు. ఇక ప్రభుత్వం ఆధ్వర్యాన కలెక్టర్, మంత్రితో పాటు ఎమ్మెల్యేలు, అసోసియేషన్ బాధ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తే పరిశ్రమల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డితో పాటు దొడ్డా రాకేశ్, ఎస్‌కే ఖాసీం, వాసు, ఆకుల నాగేశ్వరరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద ఫాసిస్ట్ ప్రమాదం పొంచి ఉంది..

- ప్రజల కోపాన్ని పక్కదారి పట్టించేందుకే పథకాలు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భార్గవ్



సమావేశంలో మాట్లాడుతున్న భార్గవ్

ఖమ్మంమయూరిసెంటర్: మనువాద బీజేపీ, సంఘ్ పరివార్ శక్తుల మతోన్మాద ఫాసిస్ట్ ప్రమాదం ముంచుకొస్తున్న తరుణాన లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష, విప్లవ కమ్యూనిస్టు శక్తులు ఐక్యంగా ఎన్నికల్లో పనిచేయాలని మార్క్సిస్ట్ విశ్లేషకుడు జి.భార్గవ్ సూచించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, ఎంఐఎం, ఆప్ బీజేపీకి బీటీమ్‌గా మారాయని తెలిపారు. బీజేపీ తీసుకొచ్చిన ప్రజావ్యతిరేక అనేక బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందన్నారు. కేసీఆర్‌కు రాజకీయ లక్ష్యం, సిద్ధాంతాలు లేవని, అవకాశవాదమే ఆయన సిద్ధాంతమని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రభుత్వాలు ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహించాల్సి ఉన్నప్పటికీ ఫాసిస్ట్ మనువాద మతోన్మాద, కార్పొరేట్లకే వత్తాసు పలుకున్నాయని ఆరోపించారు. ఎన్ఆర్‌సీ, సీఏఏ, ఎన్‌పీఆర్ బిల్లులతో మైనార్టీ వర్గాలకు పౌరసత్వం, ఓటు హక్కు లేకుండా చేయాలని చూసిన మోదీ ప్రభుత్వం అభాసు పాలైందన్నారు. ప్రస్తుతం భారత రాజ్యాంగాన్ని, పౌరులకు ఉన్న ప్రాథమిక హక్కులను రద్దు చేసే కుట్ర పన్నిందని చెప్పారు. ప్రజాసమస్యలు, వారి కోపాలను పక్కదారి పట్టించేందుకే పాలకులు సంక్షేమ పథకాలను ముందుకు తీసుకొస్తున్నారని భార్గవ్ విమర్శించారు. ఈ నేపథ్యాన కమ్యూనిస్టులు పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి సోషలిస్టు వ్యవస్థను నెలకొల్పడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎన్నికల్లో మతోన్మాద శక్తులు, పెట్టుబడిదారీ, కార్పొరేట్ వర్గాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడాలని కోరారు. సమావేశంలో ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు ఎ.రమ, కేజీ రాంచందర్, కెచ్చల రంగయ్య, రాయల చంద్రశేఖర్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, పాయం చిన్నచంద్రన్న, వి.ప్రభాకర్, కె.సూర్యం, ఎస్ఏ ల్.పద్మ, ఎం.హన్మేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాలతో 'చలో ఢిల్లీ'

ఖమ్మంమయూరిసెంటర్: రిజర్వేషన్లు, దళితుల సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయ సాధన కోసం కోటి సంతకాలతో డిసెంబర్ 4న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు తెలిపారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో బుధవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు దాటినా దళితులపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది మరింత పెరిగిందని, దళితుల కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు వారి దరిచేరలేదని చెప్పారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మంద వెంకటేశ్వర్లు, తాటి వెంకటేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, శ్రీనివాసరావు, మాదినేని రమేష్, మాచర్ల భారతి, గుంతేటి వీరభద్రం, ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు